క్లుప్తంగా

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ఏలేశ్వరం: ఆధ్యాత్మిక యాత్రలతో మానసిక ప్రశాంతత కలుగుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. పట్టణంలో శుక్రవారం జేవీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో రామేశ్వరం, కాణిపాకం, శ్రీపురం, తిరుపతి, విజయవాడ తదితర యాత్రలకు వెళ్లే బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు జేవీఆర్ ట్రస్టు చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. జేవీఆర్ టస్టు చైర్మన్ జువ్విన వీర్రాజు, జువ్విన వీరరాఘవమ్మ దంపతులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బదిరెడ్డి గోవిందు, సుంకర రాంబాబు, వాగు బలరామ్, మహిళలు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఆరోగ్యంపై శిక్షణ

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, ఉపాధి సిబ్బంది, మండలస్థాయి అధికారులకు ఆరోగ్యం, ఫిజియోథెరపీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నిజాం కళాశాల వైద్యులు సంతోష్ కుమార్ మాట్లాడుతూ బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు తదితర శారీరక సమస్యలకు ఫిజియోథెరపీతో ఉపశమనం కలుగుతుందన్నారు. ఉద్యోగులు ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాతి బుజ్జి, సీడీపీఓ పూర్ణిమ, ఏపీఎం గంగాభవాని, ఏఓ సద్గురుమూర్తి, సీహెచ్ఓ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన ఎయిర్ మార్షల్ ఎంఎస్ శ్రీధర్

అన్నవరం: ఎయిర్ మార్షల్ ఎంఎస్ శ్రీధర్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలు, చిత్రపటాన్ని ఏఈఓ కృష్ణారావు అందజేశారు.

ఘనంగా లక్ష పసుపు కొమ్ముల నోము



ప్రత్తిపాడులో లక్ష పసుపు కొమ్ముల నోము, గరిశ ధాన్యం పూజల్లో పాల్గొన్న మహిళలు

ప్రత్తిపాడు: మాఘమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక మురళీరాజు అతిథి గృహ ఆవరణలో లక్ష పసుపు కొమ్ముల నోము, గరిశ ధాన్యం పూజ నిర్వహించారు. పండితుల సారథ్యంలో ధర్మవరానికి చెందిన చేకూరి సోదరులు ఈ పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మూడు రోజుల పాటు ఈ పూజలు కొనసాగుతాయని పురోహితులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, చేకూరి రామకృష్ణంరాజు, రామరాజు, మాజీ ఎంపీటీసీ కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, పోకనాటి వెంకటేశ్వరరావు, జువ్వల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

రారండోయ్.. తీర్థం చూద్దాం

- రంపయర్రంపాలెంలో పాండవుల తీర్థానికి సర్వం సిద్ధం
- నేటి నుంచి ఐదు రోజుల పాటు తిరునాళ్లు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు



రంపయర్రంపాలెంలో తీర్థానికి ముస్తాబైన పాండవుల మెట్ట



పాండవుల మెట్టపై ఉన్న గుహ

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో శనివారం నుంచి ఐదు రోజుల పాటు జరిగే పాండవుల తీర్థానికి సర్వం సిద్ధమైంది. తీర్థం సందర్భంగాపాండవుల మెట్టను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పవిత్ర భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ఏటా ఇక్కడ ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా శనివారం నుంచి జరిగే ఈ తీర్థానికి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇక్కడ జరిగే తీర్థాన్ని చూసేందుకు జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు తండోపతండాలుగా వస్తారు.

పాండవుల మెట్ట చరిత్ర

ఈ మెట్టకు శతాబ్దాల చరిత్ర ఉంది. ఇక్కడ మెట్ట చరిత్రకు సంబంధించి రెండు భిన్నమైన కథనాలు ప్రచారంలో ఉన్నాయి. కొందరి ప్రకారం.. కొన్ని వందల సంవత్సరాల క్రితం బౌద్ధ మతస్తులు ఈ కొండపై మూడు గుహలను ఏర్పాటు చేసి ద్రౌపతిదేవి, పాండవుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. మరో కథనం ప్రకారం పాండవులు వనవాసం సమయంలో ఇక్కడ కొండపై గుహలు ఏర్పరుచుకొని నివాసం ఉన్నారు. కొండపై ద్రౌపతిదేవికి ప్రత్యేకంగా, పాండవులకు ప్రత్యేకంగా గుహలు ఉన్నాయి. దీనిని ధ్రువీకరించేందుకు భీముడు కూర్చున్న రాయి కూడా అక్కడ ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. పాండవులకు రక్షణగా రాత్రి సమయంలో భీముడు ఈ రాయిపై కూర్చొని కాపలా ఉండేవాడని, భీముడు కూర్చోవడంతో ఈ రాయి బీటలు వారిందని చెబుతుంటారు. కొండపై ఒక బావి ఉంది. ఈ బావిలో ఎల్లప్పుడూ నీరు ఉంటుంది. కరవు సమయంలో చుట్టు పక్కల మండలాలకు చెందిన ప్రజలు ఈ కొండపై పాలు పొంగించే వారు. అప్పుడు వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండటంతో ఈ కొండ మరింత ప్రాచుర్యం పొందిందని చెబుతుంటారు. కరవు సమయంలో ఈ ఆనవాయితీని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు నేటికీ పాటిస్తున్నారు.



భీముడి కూర్చోవడంతో బీటలు వారిందని చెప్పే రాయి



గుహలో ఏర్పాటు చేసిన పాండవుల విగ్రహాలు

1950 నుంచి తీర్థ మహోత్సవాలు

ఈ కొండపై 1936వ సంవత్సరంలో మెట్లు నిర్మించారు. 1950వ సంవత్సరంలో రాజామధువీటి నరసింహదేవ్ కొండపై ఉన్న గుహల్లో పాండవులు, ద్రౌపతీదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఇక్కడ ఏటా భీష్మ ఏకాదశి రోజున పాండవుల తీర్థం నిర్వహిస్తున్నారు. కొండను సుమారు 25 సంవత్సరాల క్రితం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ కొండకు ప్రాచీన చరిత్ర ఉండటంతో పురావస్తుశాఖ అధికారులు మెట్ల దారి వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది పాండవుల తీర్థం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దేవీచౌక్ ఆలయంలో ప్రత్యేక పూజలు



రాజశ్యామలాదేవి అలంకారంలో దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ఉదయం కనకదుర్గమ్మను మాతంగి రాజశ్యామలాదేవిగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.

అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి

గండేపల్లి: మండలంలోని సీలాద్రిరావుపేట గ్రామ దేవత వీరమ్మ పేరంటాలమ్మ అమ్మవారి దర్శనానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులకు అమ్మవారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు.

నరసన్న కల్యాణానికి పట్టువస్త్రాల సమర్పణ



అంతర్వేది దేవస్థానం ఈఓకు పట్టువస్త్రాలు అందజేస్తున్న సుబ్బారావు దంపతులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవాలకు అన్నవరం దేవస్థానం తరఫున ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ మేరకు శుక్రవారం అంతర్వేది దేవస్థానం ఈఓ వి.సత్యనారాయణకు వాటిని అందజేశారు. ఏటా అంతర్వేది ఉత్సవాలకు అన్నవరం దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. కాగా అన్నవరం ఈఓ దంపతులకు అంతర్వేది నరసింహస్వామి చిత్రపటం, ప్రసాదాలను ఆ దేవస్థానం ఈఓ సత్యనారాయణ అందజేశారు. కాకినాడ జిల్లా దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్ బాబు పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షుడిగా కృష్ణ



తునిలో ప్రమాణ స్వీకారం చేస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం

తుని: చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షుడిగా గణపర్తి కృష్ణ ఎన్నికయ్యారు. స్థానిక చాంబర్ కార్యాలయంలో శుక్రవారం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా వంగలపూడి మహేష్, కార్యదర్శిగా బొడ్డా శివగణేష్, సహాయ కార్యదర్శిగా చోడిశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారిగా వీర్ల ఈశ్వరరావు, సహాయ కోశాధికారిగా మిరియాల రామకృష్ణ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వంగలపూడి జమీలు, విశ్వనాథుల వాసు, చోడిశెట్టి సూర్యప్రకాష్, నరిశే మహేష్, పెనుముచ్చు వెంకటేశ్వరరావు, చెక్కల శివసూర్యనారాయణ, గంగిరెడ్ల రాజు, వంగలపూడి వాసు, వెలగా దుర్గప్రసాద్, కరెళ్ల బుచ్చియ్య, చోడిశెట్టి సాంబ, రామకుర్తి శ్రీనులను ఎన్నుకున్నారు. వీరితో ప్రస్తుత చాంబర్ అధ్యక్షుడు సకురు నాగేంద్రనెహ్రూ ప్రమాణ స్వీకారం చేయించారు. చాంబర్ మాజీ అధ్యక్షుడు నరిశే శివాజీ, కంకిపాటి జమీలు, వర్తక సలహా సంఘం సభ్యులు చోడిశెట్టి బాబూరావు, తాకాశి అప్పారావు, కంకిపాటి రామం తదితరులు నూతన కార్యవర్గానికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు అత్తిలి మురళీకృష్ణ, బీమనాథుల భాస్కరరావు, బోడాల కనకబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్పందన యువజనోత్సవం



శ్రీప్రకాష్‌లో శాంతికపోతాలు ఎగుర వేస్తున్న విజయ్‌ప్రకాష్ తదితరులు

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల్లో స్పందన యువజనోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రామకృష్ణారెడ్డి, మోడరేటర్ గ్లోరియా శాంతి కపోతాలు ఎగుర వేసి ప్రారంభించారు. ఈ యూత్ ఫెస్టివల్‌లో భాగంగా సంగీతం, సాహిత్యం, నృత్యం, థియేటర్ ఆర్ట్స్, ఫైన్ ఆర్ట్స్, క్రీడలు తదితర 30 అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. మోడరేటర్ గ్లోరియా విద్యార్థి అతిథులతో కెరియర్–సాఫ్ట్ స్కిల్స్ పాత్ర అనే అంశంపై ఇష్టాగోష్ఠి నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ హెచ్‌ఆర్ బంగార్రాజు, వైస్ ప్రిన్సిపల్ పెనుగొండ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్



పెట్రోల్, డీజిల్ ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: పెట్రోలియం ఉత్పత్తుల వల్ల సంభవించే ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ డీసీఐఎఫ్ రాధాకృష్ణ సూచించారు. మండలంలోని రాచపల్లి గ్రామ సమీపంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) పారాదీప్ –హైదరాబాద్ పైప్‌లైన్ వద్ద శుక్రవారం సాయంత్రం ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ పైప్‌లైన్ ప్రాముఖ్యత, భద్రతపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితులు, అనుమానాస్పద కార్యకలాపాల గురించి ఎస్‌ఓపీ టోల్ ఫ్రీ నంబర్ 1800 425 2159కు సమాచారం అందించాలని కోరారు. పెట్రోల్, డీజిల్ వల్ల అగ్ని ప్రమాదం సంభవిస్తే, వాటిని ఎదుర్కొనే పద్ధతులను ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. సూర్యప్రభ, ఐఓసీఎల్ అధికారులు సుబ్రహ్మణ్యం, హనుమంతరావు, సీతారాం, జిల్లా ఫైర్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు



పోతులూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీడీపీఓ పద్మ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పోతులూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ చిన్నారుల్లో పోషకాహార లోపాలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు క్రమంతప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ వరలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11.10 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు సంతోష్ ఘనపాఠి, కోట వంశీ, వేణు, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 40 మంది భక్తులు రూ.750 టిక్కెట్‌తో హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమ పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం గోపీ ఆధ్వర్యంలో పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దాత సాయంతో బ్లోయర్ ఏర్పాటు

వనదుర్గ ఆలయంలో నిర్వహించే చండీ, ప్రత్యంగిర హోమాల పొగ మండపమంతా విస్తరించడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కాగా హోమం పొగ బయటకు పోయేలా హోమ గుండం పై బ్లోయర్ ఏర్పాటు చేశారు. దాని ద్వారా పొగ వెలుపలకు వెళ్లిపోవడంతో భక్తుల కష్టాలు తీరాయి. తాటిపర్తికి చెందిన దాత దాసం వెంకటేశ్వర్లు రూ.లక్ష ఆర్థిక సాయంతో దీనిని ఏర్పాటు చేసినట్టు ఎలక్ట్రికల్ డీఈ వి.సత్యనారాయణ తెలిపారు.

వృక్ష విలాపం

- శంఖవరం–కత్తిపూడి ఆర్‌అండ్‌బీ రోడ్డులో చెట్లు నరికివేత
- పోలీసులకు ఫిర్యాదు చేసిన స్థానికులు



నెల్లిపూడి సమీపంలో ఆర్ అండ్ బీ రోడ్డుకు పక్కన ఉన్న నరికివేసిన చెట్లు

శంఖవరం: మండలంలోని శంఖవరం–కత్తిపూడి ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలను గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నరికివేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పట్టపగలు అందరూ చూస్తుండగానే అక్రమార్కులు యథేచ్ఛగా భారీ వృక్షాలను నరికి ఇతర ప్రాంతాలకు తరలించి భారీ మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. గత కొద్ది రోజులుగా ఈ తంతు జరుగుతోంది. మొదట్లో స్థానికులు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న చెట్లను నరుకుతున్నారనే భావించారు. కాగా విద్యుత్ లైన్లు లేని ప్రాంతంలో కూడా చెట్లను నరికివేయడంలో స్థానికులు అనుమానం వచ్చి అధికారులకు ఫిర్యాదు చేశారు. తొలుత అధికారులు స్పందించలేదు. స్థానికంగా అధికారులు తీరుపై విమర్శలు రావడంతో అన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై అన్నవరం ఎస్సై హరిబాబును వివరణ కోరగా విచారణ జరిపి నిందితులపై కేసు నమోదు చేస్తామన్నారు.

3,400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని శంఖవరం, ఏలేశ్వరం మండలాల్లో సారా స్థావరాలపై శుక్రవారం పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 3,400 లీటర్ల పులిసిన బెల్లపు ఊట ధ్వంసం చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ప్రత్తిపాడు ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్ ఆధ్వర్యంలో శంఖవరం మండలం గొంది రాజవరం గ్రామంలోని సారా బట్టీలపై దాడి చేసి 1,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. కాకినాడ ఏపీ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ కేవీ స్వామి బృందం ఏలేశ్వరం మండలం అప్పనపాలెంలో దాడులు నిర్వహించి, 1,800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వెంకన్నకు చక్రస్నానం



తంటికొండ వెంకన్నకు చక్రస్నానం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి శుక్రవారం చక్రస్నానం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజు ఉదయం స్వామివారికి తొలుత విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చక్రస్నానం, మహాపూర్ణాహుతి, ధ్వజారోహణం, ప్రధాన కుంభ కళావాహన, పండిత సత్కారం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, తులసీ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు, విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

నేడు స్వామివారి తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజు భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం స్వామివారి తెప్పోత్సవం నిర్వహించనున్నారు. వెంకటగిరి కొండ వెనుక ఉన్న బద్దిరెడ్డి వారి చెరువులో తెప్పోత్సవం నిర్వహించనున్నట్టు ఈఓ వడ్డాది సత్యనారాయణ తెలిపారు.

మల్లేపల్లిలో భారీ ఊరేగింపు

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లిలో లక్ష్మీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవార్లను గ్రామంలో ఊరేగించారు.

ఎలుకల సామూహిక నివారణతో మేలు

- జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ హరి
- గ్రామాల్లో జోరుగా ఎలుకల నివారణ కార్యక్రమాలు



యర్రవరంలో ఎలుకల నివారణ మందు తయారు చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



ఏలూరులో ఎలుకల నివారణ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏడీఏ వీర గంగాధర్



ఎస్.తిమ్మాపురంలో ఎలుకల మందు తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఏలేశ్వరం: ఎలుకల సామూహిక నివారణతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ హరి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల వద్ద శుక్రవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరినూకతో బ్రోమోడయోలిన్ మందును కలిపి విషపు ఎరను తయారు చేసుకోవాలన్నారు. చిన్న పొట్లాలుగా కట్టి బొరియల వద్ద ఉంచాలని సూచించారు. అనంతరం పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఏడీఏ మాధవి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శర్మ, రైతులు పాల్గొన్నారు.

సామూహిక నివారణతో మంచి ఫలితాలు

ప్రత్తిపాడు: రైతులు ఎలుకల నివారణను సామూహికంగా చేపట్టాలని జగ్గంపేట వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యింటి వీర గంగాధర్ సూచించారు. మండలవ్యాప్తంగా సామూహిక ఎలుకల నివారణా కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఆయన చెప్పారు. మండలంలోని ఏలూరు వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం సామూహిక ఎలుకల నివారణ వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామూహిక ఎలుకల నివారణతో మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఎలుకలు తినేది ఒక శాతమే అయినా కొరికి పాడు చేసేది ఆరు నుంచి పది శాతం ఉంటుందన్నారు. రైతులు సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టాలని కోరారు. అనంతరం ఎలుకల నివారణా మందును కలిపి రైతులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రొంగల సత్యనారాయణ, ఏఈఓ అర్జున్, వీఏఏ మోహన్, రైతులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: సామూహిక ఎలుకల నివారణతో వరి పంటలకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి జోకా అమృత అన్నారు. ఎస్.తిమ్మాపురంలో రైతులకు శుక్రవారం ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకేసారి రైతులంతా తమ వరి పొలాల్లో ఎలుకల మందు పెట్టడం వల్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. విషపు ఎర తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో బ్రోమోడయోలిన్ మందును రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఏఈఓ ఎ.సురేష్, వీఏఏలు అపర్ణ, వందన పాల్గొన్నారు.

జగ్గంపేట: ఎలుకల నివారణ సామూహికంగా చేపట్టాలని ఏఓ శ్రీరామ్ సూచించారు. జగ్గంపేటలో శుక్రవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఎలుకలు నివారణ మందు పంపిణీ చేశారు.

గండేపల్లి: రైతులకు ఉచితంగా ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తునట్టు ఏఓ సద్గురుమూర్తి తెలిపారు. మండలంలోని మురారిలో శుక్రవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. రైతులకు ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ రేణుక, వీహెచ్ఏ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

తొండంగి: రబీ వరిసాగు చేసిన రైతులందరూ వ్యవసాయ క్షేత్రాల్లో ఒకేసారి సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని తుని ఏడీఏ సుంకర బుల్లిబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని కృష్ణాపురం, తొండంగి, ఎ.కొత్తపల్లి గ్రామాల్లో రైతులకు సామూహిక ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం, ఏఈఓ కొప్పన దైవప్రసాద్, గ్రామసచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.